సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 2 । మే । 2025



గాలివాన బీభత్సం

పశ్చిమ ప్రకాశంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లింది. - 8లో..



రాష్ట్రాన్ని దోచుకోవడమే కూటమి నేతల పని

కూటమి ప్రభుత్వ పాలకులు, నాయకులు రాష్ట్రాన్ని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37 /29

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు

ఒంగోలు వన్‌టౌన్: ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ధనలక్ష్మి తెలిపారు. ఈ రుణాలు పొందడానికి ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శీకులు అర్హులన్నారు. మొదటి స్లాబ్ కింద కిరాణా దుకాణం, పాన్ షాప్, చికెన్ షాప్, ఫ్రూట్ స్టాల్, కూరగాయల అమ్మకం, ఎలక్ట్రికల్ మరమ్మతులు, సైకిల్ షాప్ తదితర చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికి రూ.లక్ష వరకూ సబ్సిడీపై రుణం అందించనున్నట్లు వెల్లడించారు. రెండో స్లాబ్ కింద ఏసీ, ఫ్రిజ్ మరమ్మతుల షాప్, ఆటోమొబైల్ స్పేర్‌పార్ట్స్ యూనిట్లు, బ్యాటరీ సర్వీసింగ్, సేల్స్, సెల్ ఫోన్ మరమ్మతులు, ఫుట్ వేర్ దుకాణం, బ్యూటీపార్లర్ తదితర వాటిని ఏర్పాటు చేసుకోవడానికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ రుణాలు అందిస్తామన్నారు. మూడో స్లాబ్ కింద ఆటోమొబైల్ రంగంకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, నాలుగో స్లాబ్ కింద జనరిక్ మందుల దుకాణం, ఫిట్‌నెస్ సెంటర్లు, వంటివాటికి రూ.8 లక్షల వరకూ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. జిల్లాలో 782 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.1,205 లక్షల సబ్సిడీ బ్యాంక్ రుణాలను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారుల వయసు 21 నుంచి 55 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. లబ్ధిదారుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000లోపు ఉండాలన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. 33 శాతానికిపైగా రుణాలను మహిళలకు కేటాయిస్తామన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, రవాణా పథకం అయితే డ్రైవింగ్ లైసెన్సు జతపరిచి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దర్ఖాస్తు చేసుకుని సంబంధిత పత్రాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి/మున్సిపల్ కమిషనర్లకు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 9849901157, 9951160149 నంబర్లను సంప్రదించాలని ధనలక్ష్మి సూచించారు.

పల్లె వైద్యం.. ఊపిరితీసి..!

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న విలేజ్ క్లినిక్‌లను దెబ్బతీసే కుట్రలు, కుయుక్తులకు కూటమి ప్రభుత్వం తెరతీసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకం ప్రకారం దొడ్డిదారుల్లో చర్యలు చేపట్టింది. వైద్యపరంగా పేదలకు అండగా నిలుస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లకు ఇంక్రిమెంట్లు నిలిపివేసింది. అత్యవసర సమయాల్లో ఆదుకునే పీఎఫ్‌ను సైతం ఆపేసింది. చివరకు విలేజ్ క్లినిక్‌లకు ఇస్తున్న అద్దె కూడా చెల్లించడం లేదంటే.. పాలకుల నిర్లక్ష్య వైఖరి స్పష్టమవుతోంది. ఎన్నికల ముందు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఇచ్చిన హామీని గంగలో కలిపేసింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో సీహెచ్‌ఓలు ఆందోళన పేరుతో రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా క్లినిక్‌లు మూతపడ్డాయి.

- అధికారంలోకి వచ్చీరాగానే విలేజ్ క్లినిక్‌లపై కూటమి కుట్రలు
- భవనాలకు అద్దెలు చెల్లించకుండా వేధింపులు
- సీహెచ్‌ఓలకు ఇంక్రిమెంట్లు, పీఎఫ్ నిలిపివేత
- ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ నిధులకు కోత
- సీహెచ్‌ఓలపై పడుతున్న ఆర్థిక భారం
- గత్యంతరం లేక సమ్మెకు దిగిన సీహెచ్‌ఓలు
- జిల్లాలో మూతపడిన 538 విలేజ్ క్లినిక్‌లు
- వారం రోజులుగా నిలిచిపోయిన వైద్య సేవలు



ఒంగోలు టౌన్:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు, ఏరియా వైద్యశాలలు, జిల్లా వైద్యశాలల్లో అత్యాధునిక వైద్య పరికరాలు సమకూర్చింది. వైద్య సిబ్బంది కొరత లేకుండా, మందులకు ఇబ్బంది లేకుండా చేసింది. అందులో భాగంగా 2019లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. జిల్లాలో 538 క్లినిక్‌లు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించింది. ఈ క్లినిక్‌లలో 12 రకాల వైద్య సేవలు అందించడమే కాకుండా 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు, 104 రకాల మందులు అందించింది. మంచం మీద ఉన్న రోగులకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించడంతో పాటు మందులు కూడా ఇచ్చేలా చర్యలు తీసుకుంది. ఎలాంటి ఆటంకాలు లేకుండా విలేజ్ క్లినిక్‌ల వైద్య సేవలు కొనసాగాయి. కూటమి ప్రభుత్వం రావడంతో కష్టాలు మొదలయ్యాయి. వీటిని నిర్వీర్యం చేసేందుకు గత పది నెలల్లో కూటమి ప్రభుత్వం చేయని కుట్రలు లేవని గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్సెంటివ్‌లు ఇవ్వకుండా వేధింపులు...

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నేషనల్ హెల్త్ మిషన్ కింద సీహెచ్‌ఓలను నియమించారు. నెలకు రూ.25 వేల జీతంతో పాటు రూ.15 వేల ఇంక్రిమెంట్, ఇన్సెంటివ్‌లు ఇచ్చే ఒప్పందం మీద నియామకాలు జరిగాయి. గత ఐదేళ్లలో అలాగే ఇచ్చారు కూడా. కానీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇన్సెంటివ్‌లను నిలిపివేసింది.

అద్దె చెల్లింపులు నిలిపివేత...

జిల్లాలో 538 విలేజ్ క్లినిక్‌లు ఉండగా, వాటిలో 202 క్లినిక్‌లకు సొంత భవనాలు లేవు. దీంతో అద్దె భవనాలలో వాటిని నిర్వహిస్తున్నారు. వీటికి ప్రతినెలా అద్దె చెల్లించకుండా కూటమి పాలకులు నిలిపివేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది కాలంగా అద్దెలు చెల్లించకపోవడంతో భవన యజమానులు ఒత్తిడి చేస్తున్నారని సీహెచ్‌ఓలు వాపోతున్నారు. చేసేదేమీ లేక కొందరు తమకు వచ్చే జీతాల నుంచే క్లినిక్‌ల అద్దెలు చెల్లిస్తుండటం గమనార్హం. అసలే జీతం నుంచి ఇన్సెంటివ్‌లను కోత కోసిన బాధలో ఉన్న సీహెచ్‌ఓల నెత్తి మీద అద్దెల భారం కూడా పడింది. ఇంతటితో ఆగకుండా ఎస్‌క్వాష్ ఖర్చు కూడా సీహెచ్‌ఓల మీద వేసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఏడాదికోసారి నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ ద్వారా విలేజ్ క్లినిక్‌ల పనితీరును పరిశీలించడం జరుగుతుంది. దీనికి రూ.50 వేలు ఖర్చవుతుంది. కేంద్రం నుంచి వచ్చే ఈ నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఏడాదికి కేవలం రూ.10 వేలిచ్చి చేతులు దులిపేసుకుంటుండడంతో మిగతా 40 వేల ఖర్చు కూడా సీహెచ్‌ఓలే సొంతంగా భరించాల్సి రావడం ఉద్యోగులకు తలకుమించిన భారంగా మారింది. చివరికి క్లినిక్‌ను శుభ్రం చేసేందుకు పారిశుధ్య కార్మికులను కూడా ఇవ్వకపోవడంతో సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. మరికొందరైతే తామే స్వయంగా క్లినిక్‌ను శుభ్రం చేసుకుంటున్నారని, డిగ్రీలు చదివి, పీహెచ్‌డీలు చేసి చివరికి విలేజ్ క్లినిక్‌లను శుభ్రం చేసుకోవాల్సిన దయనీయ పరిస్థితిలో ఉన్నామని ఆవేదన చెందుతున్నారు.

పదోన్నతులపై మౌనం...

సీహెచ్‌ఓలకు పదోన్నతులిచ్చే అంశంపై ప్రభుత్వం నోరు మెదపడంలేదు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సీహెచ్‌ఓలకు పదోన్నతులివ్వాల్సి ఉంది. ఈ మేరకు 2023 ఆగస్టు 29వ తేదీ 731 జీవో జారీ అయింది కూడా. సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయడానికి అవసరమైతే అసిస్టెంట్స్ సపోర్టు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీహెచ్‌ఓలు మండిపడుతున్నారు. ఇక, ఉద్యోగులకు ఎంతో ముఖ్యమైన పీఎఫ్ సౌకర్యాన్ని కూడా నిలిపివేయడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

ఆగిన వైద్య సేవలు, గ్రామీణ నీటి పరీక్షలు...

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నెల 19వ తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత 24, 25 తేదీల్లో విజయవాడలో నిరసన ప్రదర్శనలు చేయడం ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ప్రభుత్వంలో చలనం రాకపోవడంతో 29వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో జిల్లాలోని విలేజ్ క్లినిక్‌లన్నీ మూతపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యారోగ్య సేవలు నిలిచిపోయాయి. కేవలం వైద్య సేవలే కాకుండా ప్రతి బుధవారం అన్ని గ్రామాల్లో మంచినీటి నాణ్యతను సీహెచ్‌ఓలు పరిశీలిస్తుంటారు. రెండు వారాలుగా నీటి నాణ్యత పరీక్షలు కూడా ఆగిపోవడంతో గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. అయినా సరే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం దారుణమని గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెల 8వ తేదీ మార్కాపురం వచ్చిన సీఎం చంద్రబాబుకు విలేజ్ క్లినిక్‌లలోని సమస్యలను సీహెచ్‌ఓలు వివరించినా ఫలితం కనిపించలేదు.

మహిళా సీహెచ్‌ఓలకు రక్షణ కల్పించాలి



జిల్లాలో మొత్తం 538 మంది సీహెచ్‌ఓలు వుండగా వారిలో 438 మంది మహిళలు పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందించే విషయంలో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతికూల వాతావరణంలో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం అన్యాయం చేయడం బాధాకరం. ఇన్సెంటివ్‌లు ఇవ్వకుండా జీతంలో కోతలు పెట్టడం, విలేజ్ క్లినిక్‌లకు అద్దెలు కూడా చెల్లించపోవడం సరికాదు.

– కల్వకుర్తి దీప్తి, సీహెచ్‌ఓ

న్యాయమైన డిమాండ్ల కోసమే సమ్మె



గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న సీహెచ్‌ఓల ప్రోత్సాహకాలు నిలిపివేయడం బాధాకరం. విలేజ్ క్లినిక్‌లను మరింత బలోపేతం చేయాల్సిన పరిస్థితిలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విచారకరం. పదినెలలుగా ఇన్సెంటివ్‌లు ఆపివేయడం, పదోన్నతుల్లో నిర్లక్ష్యం, ఇంక్రిమెంట్ సమస్య, పీఎఫ్ సౌకర్యం తీసేయడంతో అనివార్యంగా సమ్మెకు దిగాము.

– మందగిరి రాజేష్, ఏపీఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అభివృద్ధిపై అన్నిశాఖలు దృష్టి సారించాలి

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలి
- సంక్షేమ పథకాలన్నీ ప్రజల చెంతకు చేరాలి
- జిల్లా అధికారులతో సమీక్షలో రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు



అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, పక్కన కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్

ఒంగోలు సబర్బన్: ప్రజల ఆకాంక్షలు, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి చేయడంపై అన్ని శాఖల అధికారులు మరింత దృష్టి పెట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి అధికారి ఎంటీ కృష్ణబాబు సూచించారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఆయన.. ఒంగోలులోని ప్రకాశం భవనంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లాలో అమలవుతున్న తీరు, వాటి పురోగతిపై ఆయన సమీక్షించారు. శాఖల వారీగా సాధించిన పురోగతి గురించి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సామాజిక పెన్షన్‌లు – వికలాంగ పెన్షన్‌ల వెరిఫికేషన్, దీపం 2, సోలార్ విద్యుత్, రక్షిత మంచినీటి సరఫరా, వేసవిలో ఎదురయ్యే సవాళ్లు – పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, పీ–4 అమలు, మీ కోసం అర్జీలు, ఆడిట్ రీ సర్వే–పైలెట్, ఫేజ్–2 పురోగతి, హౌసింగ్, ఉపాధి హామీ పథకాలపై ప్రధానంగా కృష్ణబాబు చర్చించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా నీరు సరఫరా చేయడంతో పాటు నీటి నాణ్యత కూడా ముఖ్యమని చెప్పారు. ఉన్నత విద్యాభ్యాసం చేసి ఆర్థికంగా స్థిరపడిన వారి వివరాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి తీసుకుంటే మార్గదర్శకులుగా గుర్తించి బంగారు కుటుంబాలకు అండగా ఉండేలా చూడవచ్చని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పల్లె పండుగ పనుల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదలయ్యేలా చూస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ప్రకాశం జిల్లాను మెరుగైన స్థానంలో నిలపాల్సిన బాధ్యత అన్ని శాఖలపై ఉందన్నారు. ఆ దిశగా బలం, బలహీనతలను గుర్తెరిగి లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రకాశం జిల్లా ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో డీఆర్‌వో బి.చినఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టరు సహదిత్ వెంకట త్రివినాగ్, సీపీఓ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి.. వైఎస్ జగన్

- మే డే వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో కార్మికులకు ఎంతో మేలు చేశారని ఆ పార్టీ నాయకులు గుర్తుచేశారు. మే డే సందర్భంగా గురువారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మిక పక్షపాతి అని కొనియాడారు. తన హయాంలో అన్ని వర్గాల ఆర్థిక ప్రగతి కోసం నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టులు శతాబ్దాలుగా పనిచేస్తున్నా వాళ్లు కార్మికవర్గ ఆలోచనా విధానానికే కట్టుబడి పనిచేశారన్నారు. అదే క్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా దాదాపు 2 లక్షల 75 వేల కోట్ల రూపాయలను ఈ రాష్ట్రంలోని పేదలకు అందించి తాను పేదల వైపు ఉన్నానని స్పష్టం చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల కోసం ఒక్క కార్యక్రమం కూడా అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో పాలన ఎలా ఉంది, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎలా ఉందనే విషయాన్ని ప్రజలు గమనించి ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారన్నారు. కార్మిక దృక్పథంతో పనిచేస్తున్న వైఎస్సార్ సీపీవైపే ప్రజలు నిలబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, కె.వి.ప్రసాద్, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రొండా అంజిరెడ్డి, వెన్నపూస వెంకటేశ్వర్లు, పాలడుగు రాజీవ్, పులుసు సురేష్‌బాబు, దేవ, శ్రీకాంత్, సన్నీ, పీటర్, రవీంద్రనాథ్‌రెడ్డి, మహేష్, కె.కోటియాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకులు పేరం ప్రసన్న, ఫాతిమా, మేరీకుమారి, వి.వాణి, బడుగు ఇందిర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మే డే జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఒక్కొక్కరుగా మీడియా ముందుకు..

- వీరయ్య కేసులో రోజుకొకరు చొప్పున మీడియా ముందుకు వస్తున్న వైనం
- వీరయ్య హత్యతో సంబంధం లేదని మీడియాతో చెప్పిన ప్రధాన అనుమానితుడు, అతని భార్య
- కీలక పాత్రధారుని తల్లి కూడా మీడియా ముందుకు..
- హత్య జరిగి పది రోజులైనా ఇంకా నిందితుల జాడ లేదని చెబుతున్న పోలీసులు
- కొనసాగుతున్న అనుమానితుల విచారణ




వీరయ్య చౌదరి మృతదేహం (ఫైల్)

ఒంగోలు టౌన్: టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. తొలుత మూడు రోజుల పాటు ఎటువంటి కదలిక కనిపించని ఈ కేసులో నిందితులు ఉపయోగించినట్లు చెబుతున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న తర్వాత నుంచి కీలక సమాచారం లభించడంతో వేగం పెరిగింది. అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ యువనాయకుడిని ఈ హత్య కేసులో ప్రధాన అనుమానితుడిగా పోలీసులు నిర్ధారించారు. అతనితో పాటు అమ్మనబ్రోలుకు చెందిన హవాలా వ్యాపారి పేరు కూడా ప్రముఖంగా తెరపైకి వచ్చింది. హైదరాబాద్‌లో నివాసం ఉండే అతని కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒంగోలు నగరం కొప్పోలులోని ఒక పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న మరో వ్యక్తి హత్యలో ప్రధానపాత్ర పోషించినట్లు పోలీసులు చెబుతున్నారు. అతను హత్య జరిగిన రోజు రాత్రే వైజాగ్ పారిపోయినట్లు చెబుతున్న పోలీసులు.. అప్పటి నుంచి వైజాగ్‌లో తిష్టవేసి గాలిస్తున్నారు. ఏప్రిల్ 22వ తేదీ హత్య జరగ్గా, నేటికి పది రోజులు దాటిపోయాయి. అయినప్పటికీ కేసు మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. రెండు రోజుల క్రితం నెల్లూరు నుంచి ఇద్దరు నిందితులను తీసుకొచ్చి విచారిస్తున్నారు. ఈ ఇద్దరు హత్యలో నేరుగా పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా, ఈ కేసుకు సంబంధించి మూడు రోజులుగా పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన అనుమానితులుగా చెప్పుకుంటున్న వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు ఒక్కొక్కరిగా మీడియా ముందుకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

తనకేమీ సంబంధం లేదంటున్న అనుమానితుడు...

ఈ కేసులో కీలకపాత్ర పోషించినట్లు చెబుతున్న ప్రధాన అనుమానితుడు ఒకరు మూడు రోజుల క్రితం ఓ టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చారు. వీరయ్యతో తనకెలాంటి శత్రుత్వం లేదని చెప్పిన అతను.. ఈ కేసులో తన పేరు వినిపించడంతో షాక్‌కు గురయ్యానని చెప్పుకున్నాడు. కావాలంటే తన కాల్‌డేటా పరిశీలించుకోవచ్చని చెప్పడం గమనార్హం. బుధవారం ఆయన భార్య కూడా అదే టీవీలో ఇంటర్వ్యూలో మాట్లాడటం సంచలనం సృష్టించింది. వీరయ్య హత్య కేసులో తన భర్తకు ఎలాంటి సంబంధం లేదని చెప్పిన ఆమె.. గ్రామంతో తమకు పెద్దగా సంబంధం కూడా లేదని, పంచాయతీ ఎన్నికల సమయంలో తప్ప పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కూడా లేవని స్పష్టం చేశారు. గురువారం ప్రధాన పాత్రదారుడిగా ప్రచారం జరుగుతున్న వ్యక్తి తల్లి మరో టీవీతో మాట్లాడారు. ఆవిడైతే తన కుమారుడు చాలా మంచివాడని, ఎప్పుడూ ఎలాంటి వివాదాల్లోకి వెళ్లిన ఘటనలు కూడా లేవని తెలిపారు. తమ వాహనం పోయి చాలా రోజులైందని, వాహనం తీసుకెళ్లిన వారు హత్యకు పాల్పడి తన కుమారుడిని ఇరికిస్తున్నారేమో అనే అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం. ఇలా ఒక్కొక్క అనుమానితుడి కుటుంబ సభ్యులు మీడియా ముందుకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇంతకూ హంతకులు ఎవరు.. హత్య చేయించిందెవరన్నది ప్రశ్నగా మిగిలిందని చెప్పుకుంటున్నారు. విచారణకు ఇంతవరకూ పోలీసులు అధికారికంగా నోరుతెరిచింది లేదు. ప్రధాన మంత్రి పర్యటన తర్వాత ఈ కేసును ఫైనల్ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఆ కోణంలోనే ఎస్పీ ఏఆర్ దామోదర్ అనుమానితులను గంటల తరబడి విచారిస్తున్నారని చెబుతున్నారు. ఒకటికి రెండుసార్లు సీన్ రీక్రియేట్ చేసి పరిశీలించిన ఆయన.. అనుమానితులను కూడా ఒకటికి రెండుసార్లు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

అధినేత నమ్మకాన్ని వమ్ముచేయను



బత్తుల బ్రహ్మానందరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని, పార్టీ అభ్యున్నతికి పాటుపడతానని ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన బత్తుల బ్రహ్మానందరెడ్డిని గురువారం ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు నూరు శాతం పాటుపడతానన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం బత్తుల నిరంతరం సేవలందిస్తున్నారని పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. అనంతరం జూపూడి ప్రభాకరరావు, చుండూరు రవిబాబు, మాదాసి వెంకయ్య, కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, తదితరులు బత్తుల బ్రహ్మానందరెడ్డిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అన్నా



మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. ఈయన వెంట ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీ బేగ్‌తో పాటు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటి గోడపై పిడుగు

- 10 గృహాల్లో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

మార్కాపురం: పట్టణంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కురిసిన వర్షం ప్రభావం చూపింది. 5 గంటల సమయంలో జవహర్‌నగర్ కాలనీలో రిటైర్డు టీచర్ బి.వెంకటేశ్వరరెడ్డి ఇంటిబయట గోడలపై పిడుగు పడింది. ఆ తీవ్రతకు ఆయన ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలైన ఫ్రిజ్, టీవీ, ఏసీలతో పాటు సమీపంలో ఉండే మరో తొమ్మిది గృహాల్లో కూడా విద్యుత్ గృహోపకరణాలు కాలిపోయాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. పిడుగు తీవ్రతకు గోడ సగభాగం దెబ్బతింది.



పిడుగుపాటుకు కూలిన గోడ

అంబులెన్స్ ఢీకొని వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: అంబులెన్స్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణం సమీపంలోని హైవేరోడ్డులో చాణిక్యస్కూల్ వద్ద గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..రాచర్ల మండలం సత్యవోలు గ్రామానికి చెందిన కత్తి కిషోర్(33) బైక్‌పై గిద్దలూరుకు వస్తున్న సమయంలో అంబులెన్స్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై రక్తస్రావమైంది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం తొలుత పట్టణంలోని ఏరియావైద్యశాలకు తరలించారు. వైద్యుల సలహామేరకు మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కిషోర్ మృతదేహం

మూడేళ్ల చిన్నారి అపహరణ



అపహరణకు గురైన చిన్నారి ఐశ్వర్య



చిన్నారి ఐశ్వర్యను యువకుడు ఎత్తుకెళుతున్న సీసీ కెమెరా దృశ్యం

సింగరాయకొండ: బిస్కెట్ ప్యాకెట్ కొనిస్తానని చెప్పి మూడేళ్ల చిన్నారిని అపహరించారు. ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం..పాతసింగరాయకొండ పంచాయతీ బాలిరెడ్డినగర్‌కు చెందిన చిలకూరి రాజేశ్వరి బుధవారం మధ్యాహ్నం తన మనమరాలు చిలకూరి ఐశ్వర్యను తీసుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దకు వచ్చింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇద్దరు కుర్రాళ్లు పాపను ఆడిస్తూ బిస్కెట్ ప్యాకెట్ కొనిస్తానని చెప్పి తీసుకుని వెళ్లి తీసుకురాలేదు. ఆ కుర్రాడి కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో చివరికి గురువారం ఉదయం పాత తండ్రి హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. పాపను తీసుకెళ్లిన వ్యక్తి లింగసముద్రం అని నాయనమ్మ రాజేశ్వరి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే నాయనమ్మ రాజేశ్వరి బుధవారం పాపను తీసుకుని వచ్చి బొట్టుబిళ్లలు, డైపర్లు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలిందని, ఎస్సై తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేసి పాపను రక్షించి కుటుంబసభ్యులకు అప్పగిస్తామని ఎస్సై పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన నిమ్మచెట్లు
- విద్యుత్ స్తంభాలు నేలకొరిగి సరఫరాకు అంతరాయం
- గాలికి ఎగిరిపోయిన ఇంటిపైకప్పు రేకులు

సాక్షి నెట్‌వర్క్:

జిల్లాలో గురువారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. అప్పటి వరకు భానుడి ఉగ్రరూపం దాల్చగా..ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో గాలివాన ప్రభావం ఎక్కువగా ఉంది.

☛ పెద్దదోర్నాల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో 45 నిముషాల పాటు కురిసిన వర్షంతో యడవల్లిలో నిమ్మతోటలకు భారీగా నష్టం వాటిల్లింది. గ్రామంలో సాగు చేస్తున్న నలబోతుల ఆంజనేయులుకు చెందిన 2 ఎకరాల నిమ్మతోట, యర్రబాలెం వెంకటసాయి రమేష్‌లకు చెందిన 3 ఎకరాల నిమ్మతోటలో వందలాది చెట్లు నేలకొరిగాయి. పంట చేతి కొచ్చే సమయంలో నేల పాలైందని రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పంట నేల కూలడంతో నలబోతులు ఆంజనేయులుకు రూ.2 లక్షలు, వెంకటసాయి రమేష్‌కు రూ.లక్ష నష్టం వాటిల్లిందని వాపోయారు. యర్రబాలెం వెంకటసాయి రమేష్‌కు చెందిన తోటలోని రేకుల షెడ్డుకు సంబంధించిన రేకులు, పశువుల పాకలు గాలి తీవ్రతకు పడిపోయాయి.

☛ గిద్దలూరు మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి ఉరుములు, మెరుపులతో వర్షంకురిసింది. ఈదురుగాలల ధాటికి పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డు వేపచెట్టు నేలకొరిగింది. కొప్పువారి వీధిలో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. మండలంలోని ముండ్లపాడులో 5 విద్యుత్‌స్తంభాలు, దూర్‌చింతలతాండా గ్రామంలో 3 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పట్టణంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. గాలుల ధాటికి కొన్ని ప్రాంతాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. పోరుమామిళ్లకు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద వేపచెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పట్టణంలోని రాజానగర్, కొట్టివారివీధి, డీఆర్ఆర్ ప్లాజా వైపు వీధులు జలమయమై ప్రజల రాకపోకలు ఇబ్బందిగా మారాయి.



యడవల్లిలో గాలి తీవ్రతకు నేల కూలిన నిమ్మ చెట్లు

☛ మార్కాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులు, పిడుగులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సుమారు 40 నిముషాల పాటు కురిసిన వర్షంతో వీధులన్నీ జలమయమయ్యాయి. గత వారం రోజుల నుంచి 39 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతూ తీవ్రమైన ఎండతో అల్లాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం పడటంతో సేద తీరారు. మార్కాపురం పట్టణంతోపాటు వేములకోట, కుంట, చింతగుంట్ల, దరిమడుగు తదితర గ్రామాల్లో కూడా వర్షం కురిసింది. రోడ్లపైకి నీరు చేరింది. అయితే అక్కడక్కడ పొలంలో గ్రేడింగ్ కోసం మిర్చిని ఆర బెట్టారు. అలాంటి మిర్చి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. చింతగుంట్ల, తిప్పాయిపాలెం, మిట్టమీదిపల్లి, ఎల్‌బీఎస్ నగర్, కొత్తపల్లి తదితర గ్రామాల్లో కొంతమంది మిర్చి రైతులు మిర్చిని గ్రేడింగ్ కోసం ఆరబోశారు.



గాలి తీవ్రతకు కూలిన పశువుల పాక

☛ అర్ధవీడు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పాపినేనిపల్లి గ్రామంలోని ఓ గృహంలో వెనుకవైపు ఉన్న టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో మంటలు చెలరేగాయి. అర్ధవీడు ఎస్సీ కాలనీలో తీగలు తెగిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఇంకా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగిపోయాయి.



గిద్దలూరులో రోడ్డుకు అడ్డంగా పడిన విద్యుత్ స్తంభం



పాపినేనిపల్లిలో పిడుగుపడి కాలుతున్న కొబ్బరిచెట్టు



పోరుమామిళ్లకు వెళ్లే ప్రధాన రహదారిపై నేలకొరిగిన వేపచెట్టు

రాష్ట్రాన్ని దోచుకోవడమే కూటమి నేతల పని

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రాన్ని దోచుకోవడమే కూటమి నేతలు పనిగా పెట్టుకున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. స్థానిక వినుకొండ రోడ్డులో ఉన్న వైష్ణవి గార్డెన్స్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి నాయకులు తాము నిర్వర్తించాల్సిన బాధ్యతను పక్కన పెట్టి రాష్ట్రాన్ని నాశనం చేయటానికి, దగా చేయటానికి, అమ్మివేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కనీసం దేవాలయాల నిర్వహణ కూడా సక్రమంగా చేయడానికి చేతగాక భక్తులను బలితీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సింహాచలంలో వరాహ నృసింహస్వామి నిజరూప దర్శనం కోసం వెళ్లిన ఏడుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని తెలిసినా కాసుల కోసం ఆశపడి హడావుడిగా ఫ్లైయాష్ ఇటుకలతో నిర్మించారని, చిన్నపాటి వర్షం, గాలికే ఆ గోడ కూలి భక్తులు బలయ్యారని మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వ కాలంలో విజయవాడలో రిటైనింగ్‌వాల్ నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడారని, భారీ వర్షం కురిసినా ఆ గోడ చెక్కు చెదరకుండా ఆ ప్రాంత ప్రజలను రక్షించిందన్నారు. తిరుపతిలో వైకుంఠద్వార దర్శనం ఆ సంఘటన మరువకముందే సింహాచలం సంఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, భక్తుల ప్రాణాలు తీసింది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలతో పాటు అడవుల్లో నివశిస్తున్న మూగజీవాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని, తిరుపతిలో గోవులు మృత్యువాత పడినా ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకుండా పోయిందన్నారు. అడవుల్లో జింకలను వేటాడినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతుందని, అదే వాస్తవమైతే అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బాధ్యత వహించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే తాటిపర్తి పుట్టినరోజును పురస్కరించుకొని నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

తీర్థం పేరుతో మత్తు మందు ఇచ్చి చోరీ

ఒంగోలు టౌన్: గృహదోషం ఉందని పూజలు చేయాలని తీర్థం పేరుతో మత్తు మందు ఇచ్చి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఒంగోలులో సంచలనం సృష్టించింది. పోలీసులు కథనం ప్రకారం..నగరంలోని చైతన్య నగర్లో భూమిరెడ్డి గురుస్వామి రెడ్డి, ప్రసన్న దంపతులు నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో బ్రహ్మం గారి మాల పేరుతో కాషాయ దుస్తులు వేసుకున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ బైకు మీద వచ్చారు. భోజనానికి చందా అడగడంతో ప్రసన్న ఇంట్లోకి వెళ్లి రూ.100 తీసుకువచ్చారు. ఆ తరువాత వచ్చిన ఇద్దరు వ్యక్తులు గురుస్వామి రెడ్డిని పిలిచి నీ ఇంటికి గృహదోషం ఉందని, పూజలు చేయాలని చెప్పారు. అందుకు రూ.30 వేలు ఖర్చు అవుతుందని చెప్పగా..నమ్మిన ఆ దంపతులు రూ.20 వేలకు బేరమాడారు. పూజలో కూర్చున్న కషాయ వేషధారులు గురుస్వామిరెడ్డి దంపతులకు తీర్థం పేరుతో మత్తు మందు ఇచ్చారు. అది తాగిన ఆ దంపతులు మత్తులోకి వెళ్లిపోగా 5 గ్రాముల బంగారు ఉంగరం, రూ.5 వేలతో పరారయ్యారు. కొద్దిసేపటి తరువాత తేరుకొని చూడగా స్వాములు కనిపించలేదు. చోరీ జరిగిన విషయాన్ని తాలుకా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు కాషాయం దుస్తుల్లో ఉన్న నిందితులను గుర్తించినట్లు సమాచారం.



సీసీ ఫుటేజీల్లో లభించిన గుర్తు తెలియని వ్యక్తుల చిత్రాలు

గుర్రం యజ్ఞేష్ అంత్యక్రియలు పూర్తి

ఒంగోలు టౌన్: పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఒంగోలుకు చెందిన మెడికో గుర్రం యజ్ఞేష్ (21) అంత్యక్రియలు గురువారం మధ్యహ్నం పూర్తయ్యాయి. యజ్ఞేష్ కుటుంబం నగరంలోని భాగ్యనగర్ రెండో లైను వాటర్ ట్యాంకర్ దగ్గర నివాసముంటారు. తండ్రి గురువీర్ డెయిరీ నిర్వహిస్తుంటారు. ఆయనకు ఇద్దరు సంతానం కాగా యజ్ఞేష్ పెద్ద కుమారుడు. పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాడు. చదువుల్లో ఎంతో చురుగ్గా ఉండే యజ్ఞేష్ కుటుంబసభ్యులతో ఎంతో కలివిడిగా ఉండేవాడు. నెల్లూరులోని ఒక మెడికల్ కాలేజీలో చదువుతున్న యజ్ఞేష్ మెడిసిన్ మొదటి సంవత్సరం పరీక్షల్లో కూడా మంచి మార్కులతో పాసయ్యాడని కుటుంబ సభ్యులు చెప్పారు. డాక్టర్‌గా ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ కుటుంబం యజ్ఞేష్ అకాల మరణంతో విషాదంలో కూరుకుపోయింది. తల్లి మల్లీశ్వరిని ఓదార్చడం ఎవరితరం కావట్లేదు.

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ వైవీ సుబ్బారెడ్డి మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక బొమ్మరిల్లు అనాథ ఆశ్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పిల్లలతో కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. అనంతరం చిన్నారులకు అన్నదానం చేశారు.

♦ వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు కార్యాలయంలో వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడు శేషారెడ్డి, లీగల్ సెల్ సిటీ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్, కత్తి కోటేష్‌బాబు, పీవీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చుండూరు రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, ఇతర నేతలు

అమ్మో..ఆ గదా..!

- శిథిలావస్థకు చేరిన మార్చురీ
- అక్కడకు వెళ్లాలంటే జంకుతున్న వైద్యులు
- ఖాళీగా ఉన్న ఫోరెన్సిక్ డాక్టర్ పోస్టు



శిథిలావస్థకు చేరిన పోస్టుమార్టం రూం



శిథిలమైన విద్యుత్ మార్చురీ

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లోని మార్చురీ గదికి వెళ్లాలంటే వైద్యులు సైతం జంకుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఈ నిర్మించిన మార్చురీ పూర్తిగా శిథిలావస్థకు చేరి శ్లాబు కూలే దశలో ఉంది. దీంతో ఆ గదిలో పోస్టుమార్టం చేయాలంటే వైద్యులు జంకుతున్నారు.

ఎప్పుడు కూలుతుందోనన్న భయం..

మార్కాపురం జీజీహెచ్‌కు పశ్చిమ ప్రకాశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు వైద్యసేవల కోసం వస్తుంటారు. గిద్దలూరు నుంచి పుల్లలచెరువు వరకూ ఉన్న పశ్చిమ ప్రకాశంలో దోర్నాల–శ్రీశైలం, దోర్నాల –ఆత్మకూరు, తర్లుపాడు – పొదిలి ఘాట్ రోడ్డు ఉంది. అనంతపూర్ – విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు తిప్పాయిపాలెం నుంచి త్రిపురాంతకం వరకూ మార్కాపురం పరిధిలో ఉంది. ఇక మార్కాపురం నుంచి కొనకనమిట్ల కూడా నేషనల్ హైవే ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాల పరిధిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటితో పాటు క్షణికావేశంలో కొంతమంది ఆత్మహత్య చేసుకుంటుంటారు. ఇలా నెలలో 10 నుంచి 15 మంది వరకూ చనిపోతుంటారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తీసుకువస్తారు. అయితే 30 ఏళ్ల క్రితం నిర్మించిన జీజీహెచ్ మార్చురీ శిథిలావస్థకు చేరింది. పోస్టుమార్టం గది, విద్యుత్‌తో అంతిమ సంస్కారం చేసే మార్చురీ రూం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలీని పరిస్థితుల్లో ఉండటంతో పోస్టుమార్టం చేయాలంటే వైద్యులు సైతం భయపడుతున్నారు. పోస్టుమార్టం చేసే సమయంలో శ్లాబ్ కూలితే తమ పరిస్థితేంటని ఆందోళన చెందుతున్నారు.

ఫోరెన్సిక్ వైద్యుల పోస్టు ఖాళీ..

మార్కాపురం జీజీహెచ్‌లో ఫోరెన్సిక్ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏవైనా మృతదేహాలు వస్తే డ్యూటీలో ఉండే డాక్టర్లు, స్పెషలిస్టు వైద్యులు పోస్టుమార్టం చేస్తున్నారు. ఫోరెన్సిక్ వైద్యులు ఉంటే మృతి చెందిన వ్యక్తి వివరాలు పోస్టుమార్టంలో సరిగ్గా వస్తాయి. ప్రధానంగా ఉరేసుకొని, పురుగు మందు తాగి, కాల్చుకొని, అనుమానాస్పదంగా మృతి చెందిన వారి కేసుల్లో ఫోరెన్సిక్ డాక్టర్ పోస్టుమార్టం చేస్తే నివేదిక సక్రమంగా వస్తుంది. ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో జనరల్ డాక్టర్లు పోస్టుమార్టం చేయాల్సి వస్తుంది. వైద్య ఆరోగ్యశాఖ జోక్యం చేసుకుని ఇప్పటికైనా శిథిలావస్థకు చేరిన పోస్టుమార్టం రూము కొత్తది నిర్మించాలని, ఖాళీగా ఉన్న ఫోరెన్సిక్ డాక్టర్ పోస్టును భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.